www.jananinadam.com

Follow :

జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి అయుధం

తెలుగు దినపత్రిక

పాఠకులకు ప్రకటన కర్తకు శ్రేయోభిలాషులకు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మరియు సిబ్బందికి

దీపావళి

శుభాకాంక్షలు



ఆదివారం 08-11-2026

సంపుటి : 2 సంచిక : 181

ఆసిఫాబాద్ Asifabad

హైదరాబాద్ Hyderabad


ఎడిటర్ : జాధవ్ రోహిదాష్

Editor: JADAV ROHIDAS

పేజీలు : 04

వెల: రూ.2.00

Simultaneously published from ,Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com



ఇరాన్ అణు రహస్యాలు చెబితే రూ.166 కోట్లు..

అమెరికా సంచలన ఆఫర్

ఇరాన్ అణు కార్యక్రమంపై సమాచారానికి అమెరికా భారీ రివార్డు

వివరాలిచ్చిన వారికి 20 మిలియన్ డాలర్ల వరకు నజరానా

ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటన

చర్చల ద్వారా సమస్య పరిష్కారానికి సిద్ధమన్న ఇరాన్ అధ్యక్షుడు

ఇరాన్ అణు కార్యక్రమంపై కీలక సమాచారం అందించిన వారికి 20 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 166 కోట్లు) వరకు భారీ రివార్డును అమెరికా ప్రకటించింది. శుక్రవారం యూఎస్ సెంట్రల్ కమాండ్ ఈ సంచలన ప్రకటన విడుదల చేసింది. సమాచారం అందించిన వారికి అవసరమైతే

17 ఏళ్ల నిరీక్షణకు తెర...

కూకట్‌పల్లి ఫ్లాట్లపై సుప్రీం కీలక ఆదేశాలు

కూకట్‌పల్లి ఫ్లాట్లపై 17 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదం

101 మందికి నవంబర్ 23లోగా రిజిస్ట్రేషన్ చేయాలని సుప్రీం ఆదేశం

కొనుగోలుదారులకు అత్యున్నత న్యాయస్థానంలో భారీ ఊరట

14 శాతం వడ్డీ వసూలుపై హైకోర్టుదే తుది నిర్ణయమని స్పష్టీకరణ

కేసు తేలే వరకు ఆస్తులు అమ్మరాదని ఇరువర్గాలకు ఆంక్షలు



2వ పేజీలో...



2వ పేజీలో...

హైదరాబాద్‌లో స్నేహం

పేరుతో మోసం...

కిలోల కొద్దీ బంగారం, వెండి చోరీ

స్నేహితురాలిని నమ్మించి ఆమె పిన్ని ఇంట్లో భారీ చోరీ

నిందితుడు కాలేజీ వార్డెన్ చంద్రశేఖర్‌గా గుర్తింపు

సుమారు అరకిలో బంగారం, మూడు కిలోల వెండి అపహరణ

నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు...

హైదరాబాద్ 07: బంగారం, నగదు స్వాధీనంస్నేహం పేరుతో నమ్మించి భారీ చోరీకి పాల్పడిన ఘటన నేరెడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. తన స్నేహితురాలి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ఓ యువకుడు, ఆమె పిన్ని ఇంట్లో ఏకంగా అర కిలోకు పైగా బంగారం, మూడు కిలోల వెండి

ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే..

రైతులకు సీఎం రేవంత్ కీలక హెచ్చరిక



2వ పేజీలో...

సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తానన్న సీఎం రేవంత్

ఎల్నినోతో వర్షాభావ పరిస్థితులుంటాయని ప్రజలకు అప్రమత్తం

ప్రాజెక్టుల్లోని నీళ్లు తాగునీటికే సరిపోతాయని స్పష్టీకరణ

రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచన

గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరంటూ కేటీఆర్‌పై విమర్శలు

ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకే సరిపోతాయని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం

ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ 07: దశాబ్ద కాలంగా సొంతింటి కోసం ఎదురు చేస్తున్న పొన్నం కోమల-సమ్మయ్య ముదిరాజ్ లకు ప్రజా పాలన ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం పట్ల తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఘనంగా మన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి..కార్యక్రమంలో ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు యజమాని పొన్నం కోమల-సమ్మయ్య ముదిరాజ్ లకు మంత్రి పొన్నం ప్రభాకర్ బట్టలు పెట్టి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ ఇంట్లో దీపావళి సందర్భంగా లబ్దిదారు ఇంట్లో క్రాకర్స్ కాల్చి బాణనంచా పేల్చి ఘనంగా దీపావళి



గ్రామ పంచాయతీలకు తెలంగాణ సర్కార్ తీపి కబురు..



హైదరాబాద్ 07: తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. గ్రామ పంచాయతీలు వివిధ మార్గాల ద్వారా సమకూర్చుకునే సొంత ఆదాయాన్ని ఇకపై ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ చేయాల్సిన అవసరం లేకుండా కీలక నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు పంచాయతీల సొంత ఆదాయాన్ని నేరుగా ఆయా గ్రామ పంచాయతీల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేసుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ కొత్త విధానం అక్టోబర్ 9 నుంచే అమల్లోకి వచ్చినట్లు వెల్లడించింది. గతంలో గ్రామ పంచాయతీలు పన్నులు, ఇతర రుసుముల రూపంలో వసూలు చేసిన ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ చేయాల్సి వచ్చేది. దీంతో గ్రామాల్లో సేకరించిన ఆదాయాన్ని తిరిగి స్థానిక అవసరాలకు వినియోగించుకోవాలంటే ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రామ పంచాయతీలకు ఆర్థికపరమైన స్వేచ్ఛ కలగనుంది.అభివృద్ధి పనులకు నిధుల వినియోగంలో వెసులుబాటు:గతంలో అమల్లో ఉన్న విధానం వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇతర మౌలిక సదుపాయాల కల్పన వంటి

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని

ప్రారంభించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేట07: సిద్దిపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రారంభించారు ఈ సందర్భంగా రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం, అకాల వర్షాలతో రైతులు పడుతున్న ఇబ్బందులు, మార్కెట్ యార్డుల దుస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.రాష్ట్రంలో కరువు పరిస్థితుల వల్ల ఒకవైపు దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు కన్నీళ్లు పెడుతుంటే.. మరొకవైపు పండిన కాస్త పంటను అమ్ముకుందామంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో, ముఖ్యంగా దొడ్డు వడ్లు పండించిన రైతులు తీవ్ర ఇబ్బందులు వడుతున్నారు.ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, సిద్దిపేట, మెదక్ తదితర జిల్లాల్లో కురుస్తున్న అకాల వర్షాల వల్ల కళ్లాలలో, ఐకేపీ సెంటర్లలో, పీఏసీఎస్ సెంటర్లలో, మార్కెట్ యార్డులలో పోసిన వడ్లు



సిద్దిపేట మూడు సార్లు కాదు..

ముప్పై సార్లు వచ్చిన నువ్ చేసేది ఎం లేదు, రేవంత్ రెడ్డి

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్దిపేట 07: సిద్దిపేట కు వచ్చి ఋణ మాఫీ చేస్తానని, 45 రోజుల్లో రైతు బందు వేస్తా అని మోసం చేసావు. ఉద్యమాల త్యాగాల చరిత్ర మాది. నాడు తెలంగాణ కోసం పదవులను గడ్డి పోచల తృణ ప్రయాంగా వదిలాం. రేవంత్ రెడ్డి సిద్దిపేట కు వస్తే ప్రజలకు క్షమాపణ చెప్పి రావాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్ చేసారు.శనివారం అయన నూతనంగా ఎన్నికైన పార్టీ విద్యార్థి విభాగం గ్రామ కమిటీల సన్మాన కార్యక్రమం లో పాల్గొన్నారు.హరీష్ రావు మాట్లాడుతూ సిద్దిపేట మూడేళ్లలో అడుగు పని జరగలేదు. సిద్దిపేట మంజూరు అయిన వెటర్నరీ కళాశాల తెచ్చి సిద్దిపేట కు రా. సిద్దిపేట అయిల్ ఫామ్ చుసి కొడంగల్



2వ పేజీలో...

ఈ ఏడాది సొంతింటి కల నెరవేరిన పేదల

ఇళ్లలో ఆత్మగౌరవంతో,

ఆనందోత్సాహాల మధ్య దీపావళి పండుగ..!



2వ పేజీలో...

రంగారెడ్డి 07: శనివారం నాడు రంగారెడ్డి జిల్లా నందిగామలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు. స్థానిక శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్గా, ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఆయా శాఖల అధికారులతో కలిసి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా నందిగామలో ఇందిరమ్మ ఇండ్ల

కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి: కేటీఆర్

కొడంగల్ ఎత్తిపోతలలో భారీ అవకతవకలు జరిగాయన్న కేటీఆర్

రూ.1450 కోట్ల నుంచి రూ.6825 కోట్లకు ప్రాజెక్టు వ్యయాన్ని పెంచారని విమర్శ

ఇది క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అంటూ తీవ్ర విమర్శ



తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తి పోతల పథకం టెండర్లలో భారీ అవక తవకలు జరిగాయని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని ఆరోపించారు.ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉండగా, దానిని ఇప్పుడు రూ.6,825 కోట్లకు పెంచారని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఇంకా చుక్క నీరు అందకముందే, అంచనా వ్యయాన్ని దాదాపు ఐదు రెట్లు పెంచి రాష్ట్ర

ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్ రంగాల్లో

గ్లోబల్ పెట్టుబడులకు ప్రోత్సాహం

: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబరు 07: హైదరాబాద్‌ను అంతర్జాతీయ ఫిన్‌టెక్, గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. ఇండస్ట్రీయల్ అండ్ టెక్నాలజీ ఎకోసిస్టమ్ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. హైటెక్ సిటీలో ఆర్థాఫిన్‌టెక్ కార్యాలయాన్ని మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్



ఇరాన్ అణు రహస్యాలు చెబితే రూ.166 కోట్లు..

అమెరికా సంచలన ఆఫర్

మొదటిపేజీ తరువాయి...

పునరావాసం కూడా కల్పిస్తామని స్పష్టం చేసింది. అమెరికా విదేశాంగ శాఖకు చెందిన 'రివార్డ్స్ ఫర్ జస్టిస్' కార్యక్రమం కింద ఈ ఆఫర్‌ను ప్రకటించారు. ఇరాన్ అణు కేంద్రాలు, వాటిలో ఉపయోగించే పరికరాలు, ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న శాస్త్రవేత్తలు, ఇతర సిబ్బంది వివరాలు అందించాలని కోరారు. సిగ్నల్ లేదా టోర్ ఆధారిత చానెల్ ద్వారా ఈ సమాచారాన్ని రహస్యంగా పంపవచ్చని సూచించారు. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) నిబంధనలను ఇరాన్ ఉల్లంఘిస్తోందని, దీనివల్ల సెంట్రిఫ్యూజ్‌ల వంటి కీలక పరికరాల ఉత్పత్తి, నిల్వలపై పర్యవేక్షణ లేకుండా పోయిందని అమెరికా విదేశాంగ శాఖ ఆరోపించింది. మరోవైపు, ఈ ప్రకటనకు ముందు ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మనం ఇరాన్‌పై దాడి చేయకపోయి ఉంటే, ఈ రోజు ఇజ్రాయెల్ ఉండేది కాదు. వారికి అణ్వాయుధాలు చిక్కి ఉంటే తప్పకుండా వాడేవారు" అని ఆయన అన్నారు. గత ఎనిమిది నెలల ఘర్షణతో ఇరాన్ ఆర్థికంగా, సైనికంగా తీవ్రంగా దెబ్బతిన్నదని, ఇప్పుడు ఒప్పందం కోసం ఆరాటపడుతోందని ట్రంప్ పేర్కొన్నారు. మధ్య ఇరాన్‌లోని 'పికాక్స్ మౌంటెన్' వంటి ఒకటి రెండు ప్రాంతాలపై ఇంకా దృష్టి సారించాల్సి ఉందని ఆయన తెలిపారు. అయితే, ట్రంప్ ఆరోపణలను ఇరాన్ అధికారులు ఖండించారు. 'పికాక్స్ మౌంటెన్'కు అణు కార్యకలాపాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ సంక్షోభాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి టెహ్రాన్ సిద్ధంగా ఉందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజేష్కియాన్ ఇటీవలే స్పష్టం చేయడం గమనార్హం.

ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

మొదటిపేజీ తరువాయి...

జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ కౌన్సిలర్ లు, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, ఇతర ముఖ్య నేతలు,అధికారులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న పేదల సొంతింటి కలను ప్రజా పాలన ప్రభుత్వంలో సాకారం చేస్తున్నాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేద కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపింది ఈ దీపావళి పండుగను మా ఇందిరమ్మ ఇళ్లలో జరుపుకుంటున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో పూర్తయిన 2,500కు పైగా ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలుహుస్నాబాద్ పట్టణంలో కోమల సమ్మయ్య ఇందిరమ్మ ఇంట్లో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి దీపావళి వేడుకలు జరుపుకున్నాం. ప్రజా పాలన ప్రభుత్వంలో హుస్నాబాద్ నియోజకవర్గానికి మొదటి దశలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి 2500 పైగా ఇళ్లు పూర్తయ్యాయి.500 గుడిసెల స్థానంలో ఇళ్లు, మధ్యలో నిలిచిపోయిన మరో 500 ఇళ్లకు, రెండో దశలో 1,000 ఇళ్లకు మంజూరు అయ్యాయిఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. రెండో దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను వారం,పది రోజుల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించే ప్రక్రియ పూర్తి చేస్తాంరూఫ్ లెవల్‌లో ఉన్న లబ్ధిదారులు కూడా త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి.

17 ఏళ్ల నిరీక్షణకు తెర...

మొదటిపేజీ తరువాయి...

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ఫేజ్-15లో ఇళ్ల కోసం గత 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న కొనుగోలుదారులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వివాదంలో ఉన్న 101 ఫ్లాట్లను ఈ నెల 23వ తేదీలోగా కొనుగోలుదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని తెలంగాణ హౌసింగ్ బోర్డును సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లితో కూడిన ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వాయిదాల చెల్లింపుల్లో జాప్యం జరిగిన వారి నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయాలా? వద్దా? అనే అంశాన్ని హైకోర్టు తేల్చే వరకు వేచి చూడాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, వడ్డీ వివాదం తేలే వరకు కొనుగోలుదారులను ఇబ్బంది పెట్టకూడదని పేర్కొంటూ, తక్షణమే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. హైకోర్టులో కేసు పరిష్కారమయ్యే వరకు ఈ ఇళ్లను ఇతరులకు విక్రయించడం లేదా బదిలీ చేయడం వంటి చర్యలు చేపట్టరాదని అటు హౌసింగ్ బోర్డుకు, ఇటు కొనుగోలుదారులకు న్యాయస్థానం ఆంక్షలు విధించింది. 2009లో హౌసింగ్ బోర్డు 'సంపూర్ణం' పథకం కింద కేపీహెచ్‌బీలో ఇళ్లను కేటాయించింది. తొలుత ఫ్లాట్ ధరను రూ.30.80 లక్షలుగా నిర్ణయించి, ఆ తర్వాత దానిని రూ.47.85 లక్షలకు పెంచడంతో వివాదం మొదలైంది. నిర్మాణంలో జాప్యం, అదనపు ధరల వసూలుపై కొనుగోలుదారులు వినియోగదారుల ఫోరం నుంచి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) వరకు న్యాయపోరాటం చేశారు. బోర్డు వైపు నుంచే జాప్యం జరిగిందని నిర్ధారించిన ఎన్‌సీడీఆర్‌సీ, కొనుగోలుదారుల నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయడం సమర్థనీయం కాదని గతంలో తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ హౌసింగ్ బోర్డు తొలుత హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా.. తమ వైపు నుంచి జరిగిన ఆలస్యానికి 6 శాతం వడ్డీ చెల్లిస్తామని, అయితే కొనుగోలుదారుల నుంచి మాత్రం 14 శాతం వడ్డీ వసూలుకు అనుమతించాలని బోర్డు కోరింది. బోర్డు వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, బాధితుల 17 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలుకుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే.. రైతులకు సీఎం రేవంత్ కీలక హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి...

ఉందని, రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచించారు. ఎల్నినోపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందరం కలిసికట్టుగా పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని సీఎం ప్రకటించారు. మూడు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్నినో ప్రభావం ఉంటే తెలంగాణలోనే కరవు వచ్చినట్లు బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని రేవంత్ విమర్శించారు. బావబామ్మర్దులు ఊళ్లపై పడి అబద్ధాలు చెబుతారని, వారి మాటలు విని రైతులు నష్టపోవద్దని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి వంటి ఎక్కువ నీరుఅవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరారు.వేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోసుకోకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్కు నీళ్లు వెళ్తున్నాయన్న బీఆర్ఎస్ ఆరోపణల్లో నిజం లేదని సీఎం అన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి నుంచి ఎత్తిపోసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు దించే పరిస్థితి కూడా లేదన్నారు. బీఆర్ఎస్ అవినీతి వల్లే ఈ మూడు బ్యారేజీలు పనిచేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన దేవాదుల, వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్టులే ప్రస్తుతం రైతులకు, ఖమ్మం జిల్లాకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. పాలమూరు నుంచి గెలిచిన కేసీఆర్ భారీ బడ్జెట్ ఖర్చు చేసినా అక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని రేవంత్ విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి పేరు, స్థలం, అంచనాలు మార్చి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలోనే కూలిపోయిందని ఆరోపించారు. వచ్చే డిసెంబరులో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు స్పీకర్ అనుమతి కోరుతున్నామని, ఆ సమావేశాల్లో ఎల్నినో, కాళేశ్వరం అంశాలపై చర్చించేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం అంచనాలు పెంచడంపై కేటీఆర్ చేస్తున్న విమర్శలకూ సీఎం సమాధానమిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొడంగల్ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షలు ఇచ్చేందుకు కూడా కేసీఆర్ ప్రభుత్వం ముందుకు రాలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షల వరకు పరిహారం ఇస్తోందన్నారు. హైదరాబాద్-లగచర్ల ప్రాంతాన్ని ఢిల్లీ-నోయిడా తరహాలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. హకీంపేటలో 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. కేటీఆర్ వేషభాషలు మార్చుకున్నా ప్రజలు నమ్మరని రేవంత్ ఎద్దేవా చేశారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరని వ్యాఖ్యానించారు. తాను మూడేళ్లుగా గంట కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానని చెప్పారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని, అబద్ధాలు ప్రచారం చేస్తున్న కుటుంబాన్ని ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

ఆదిలాబాద్ రిమ్స్‌లో వెంటిలేటర్ల చోరీ.. దొంగల ముఠా అరెస్ట్



జననినాదం,ఆదిలాబాద్07: ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రిలో నాలుగు వెంటిలేటర్లను చోరీ చేసిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు చెందిన సజ్జన్, అభిజిత్ అనే ఇద్దరు వ్యక్తులు టెక్నీషియన్లమంటూ రిమ్స్‌లోకి ప్రవేశించి వెంటిలేటర్లను అపహరించినట్లు తెలిపారు. గత నెల 30న రిమ్స్ ఆస్పత్రిలోని రెండో అంతస్తులో ఉన్న ఆర్ఐసీయూ, చెస్ట్ వార్డుల నుంచి ఒక్కో వెంటిలేటర్, టీబీ వార్డు నుంచి మరో రెండు వెంటిలేటర్లు చోరీకి గురయ్యాయి. మొత్తం నాలుగు పరికరాలు మాయమైనట్లు ఆస్పత్రి అధికారులు గుర్తించారు. ఇద్దరు వ్యక్తులు వెంటిలేటర్లను సంచుల్లో పెట్టుకుని తీసుకెళ్తున్న దృశ్యాలు ఆస్పత్రిలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. దీంతో రిమ్స్ డైరెక్టర్ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే నిందితులను పట్టుకున్నారు. హైదరాబాద్ వ్యాపారికి విక్రయం: వెంటిలేటర్లను చోరీ చేసిన సజ్జన్, అభిజిత్ వాటిని హైదరాబాద్‌కు చెందిన కొండారెడ్డి అనే వైద్య పరికరాల వ్యాపారికి విక్రయించినట్లు ఎస్పీ వెల్లడించారు. చోరీ చేసిన పరికరాలను కొండారెడ్డి చంద్రపూర్‌లో కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకెళుtండగా ఆదిలాబాద్ పోలీసులు గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి నాలుగు వెంటిలేటర్లతో పాటు కారు, రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును రికార్డు చేయాలి

హుస్నాబాద్ 07: హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, ప్రజావాణిలో ప్రజల నుంచి అందుతున్న వినతులు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, నియోజకవర్గంలోని ఏడు మండలాల ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.ప్రజావాణిలో ప్రజల నుంచి అందుతున్న సమస్యలను మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా భూ సమస్యలు, విద్యుత్, విద్యుత్ స్తంభాలు, ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య పెన్షన్లకు సంబంధించిన వినతులు ఎక్కువగా వస్తున్నాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినతిపత్రాలు సమర్పించడానికి వచ్చే సామాన్య ప్రజల పట్ల అధికారులు దయతో, గౌరవంగా వ్యవహరించాలని, ప్రతి వినతిపత్రం తప్పనిసరిగా రికార్డులో ఉండాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఏదో ఒక మండలంలో తాను స్వయంగా పాల్గొంటానని తెలిపారు.గ్రామాల్లో భర్తను కోల్పోయిన మహిళలకు వితంతు పెన్షన్ 15 రోజుల్లో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామ పంచాయతీలకు తెలంగాణ సర్కార్ తీపి కబురు..

మొదటిపేజీ తరువాయి...

పనులకు నిధులు విడుదల చేయించుకోవడంలో పంచాయతీలు ఇబ్బందులు ఎదుర్కొనేవి. ముఖ్యంగా బిల్లుల చెల్లింపులు, నిధుల మంజూరులో జాప్యం కారణంగా కొన్ని అభివృద్ధి పనులు సకాలంలో పూర్తికాకుండా నిలిచిపోయేవి. ఇప్పుడు సొంత ఆదాయం నేరుగా పంచాయతీల బ్యాంక్ ఖాతాల్లోనే జమ కానుండటంతో స్థానిక అవసరాలకు అనుగుణంగా నిధులను వినియోగించుకునే అవకాశం ఏర్పడనుంది. అత్యవసర పారిశుద్ధ్య పనులు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఇతర ప్రజా అవసరాలపై వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు ఈ విధానం దోహదపడనుంది. మొత్తంగా గ్రామ పంచాయతీల ఆర్థిక స్వావలంబనను పెంచడంతో పాటు స్థానిక పాలనను మరింత సమర్థవంతంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కీలకంగా మారనుంది.

సిద్దిపేట మూడు సార్లు కాదు..ముప్పై సార్లు వచ్చిన నువ్ చేసేదిఎం లేదు, రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి...

లో కట్టుకుంటున్నాడు. సిద్దిపేట లో కొత్త పనులు ఇచ్చింది లేదు పాతవి పనులు చేసింది లేదు. ఆపిన పనులు ప్రారంభం చేసి సిద్దిపేట కు రావాలి. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి వచ్చాక అన్ని ఎగొట్టాడు. ఎగవేతల రేవంత్ రెడ్డి అంటే కేసులు పెట్టాడు. ఎన్ని కేసులు పెట్టిన నిన్ను ప్రశ్నిస్తుంచడం ఆగేది లేదని అన్నారు.కాంగ్రెస్, బిజేపీ తప్పుడు ప్రచారాలని దిటుగా సోషల్ మీడియా లో తిప్పికొట్టాలి. వచ్చేది మన కెసిఆర్ మన బి ఆర్ ఎస్ ప్రభుత్వమే.. సిద్దిపేట ప్రగతి ని పరుగులు పెట్టించే బాధ్యత నాది. తుది శ్వాస వరకు మీ సేవలో ఉంటాను. మీ సేవలో అనునిత్యం అందుబాటులో మన క్యాంప్ ఆఫీస్ ఉంటుందని అన్నారు.

ఫిన్‌టెక్, డిజిటల్ బ్యాంకింగ్ రంగాల్లో గ్లోబల్ పెట్టుబడులకు ప్రోత్సాహం

మొదటిపేజీ తరువాయి...

రంగాల్లో గ్లోబల్ పెట్టుబడులకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రపంచస్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీస్‌లో పరిశోధన, అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తున్నామని చెప్పుకొచ్చారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యవంతమైన మానవ వనరుల తయారీకి రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రైజింగ్?2047 విజన్‌లో భాగంగా గ్లోబల్ కంపెనీలకు హైదరాబాద్‌ను గమ్యస్థానంగా మారుస్తామని ఉద్ఘాటించారు. బ్యాంకింగ్, అంతర్జాతీయ చెల్లింపులు, డిజిటల్ వాలెట్లలో ఆర్థిఫిన్‌టెక్ సేవలు అందిస్తాయని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి: కేటీఆర్

సంపదను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియలో మంత్రి పొంగులేటి కంపెనీ ప్రధాన పోటీదారుగా ఉందని, మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులేనని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేటీఆర్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అనే పదాలు కూడా ఈ దోపిడీ ముందు చాలా చిన్నవి అయిపోతున్నాయి. రాహుల్ గాంధీ గారూ.. ఈ దోపిడీని వర్ణించడానికి దయచేసి ఏదైనా కొత్త పదాన్ని వెతకడంలో నాకు సహాయం చేయండి" అని అన్నారు. ప్రజల అవసరాలను పక్కనపెట్టి, ప్రాజెక్టుల పేరుతో అంచనాలు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు కట్టబెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు

హైదరాబాద్‌లో స్నేహం పేరుతో మోసం...

మొదటిపేజీ తరువాయి...

ఆభరణాలను అపహరించాడు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, అతని నుంచి భారీగా బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఒక కళాశాలలో వార్డెన్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు, అదే కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థినితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఆమె పిన్ని కుమారి మానే పద్మావతి ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారం ఉన్నట్లు నిందితుడు గుర్తించాడు. తనకు అప్పులు ఉన్నాయని, బంగారం తాకట్టు పెట్టి తీర్చేసి తిరిగి ఇచ్చేస్తానని ఆ విద్యార్థినిని నమ్మించి, ఆమె వద్ద నుంచి ఇంటి తాళాలు సంపాదించాడు. గత అక్టోబరు 20న పద్మావతి తన ఇంటికి తాళం వేసి మార్కెట్‌కు వెళ్లిన సమయంలో చంద్రశేఖర్ ఈ చోరీకి తెగబడ్డాడు. ఇంట్లోని 556 గ్రాముల బంగారం, 2.9 కిలోల వెండి వస్తువులను దోచుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. బాధితురాలి సోదరి కుమార్తె ద్వారా చంద్రశేఖర్‌పై అనుమానం వ్యక్తమైంది. దీంతో సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు, నిందితుడిని తిరుమలగిరిలో అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. అపహరించిన బంగారంలో కొంత భాగాన్ని గుంటూరు, చార్మినార్ ప్రాంతాల్లో విక్రయించి రూ.25 లక్షలు పొందినట్లు వెల్లడించాడు. నిందితుడి నుంచి 429 గ్రాముల బంగారం, రూ.25 లక్షల నగదు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి ఈ కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి...

తడిసిపోయి, వరదకు కొట్టుకుపోతున్నాయి.రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ కొనుగోలు కేంద్రానికి కూడా ప్యాడీ క్లీనర్లు గానీ, టార్పాలిన్ కవర్లు గానీ, మాయిశ్చర్ మీటర్లు గానీ చేరలేదు. వడ్లు కొన్న తర్వాత తరలించడానికి అవసరమైన లారీల ట్రాన్స్‌పోర్ట్ టెండర్లు ఇంతవరకు ఫైనల్ చేయలేదు; ఏ గ్రామం వడ్లు ఏ మిల్లుకు వెళ్లాలనే 'మిల్ అలాట్‌మెంట్' కూడా ఇప్పటికీ జరగలేదు.కరువు పరిస్థితుల్లో సన్న వడ్లను ప్రైవేట్ వ్యాపారులు కొంటున్నారు, మరి దొడ్డు వడ్లు పండించిన రైతుల పరిస్థితి ఏమిటి? సివిల్ సప్లైస్ మంత్రి, మార్కెటింగ్ శాఖ మంత్రి అసలు ఏం చేస్తున్నారు? రైతులంటే కనీన వట్టింవు లేకుండా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది.మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టుగా రైతుల పరిస్థితి తయారైంది. రైతు రెండు ఎకరాల్లో నాటు వేస్తే కరువు దెబ్బకు ఎకరం ఎండిపోయింది, మిగిలిన ఎకరంలో పండిన పంటను కూడా ప్రభుత్వం సకాలంలో కొనకపోవడంతో అకాల వర్షాలకు తడిసిపోయి రైతులు ఆగమవుతున్నారు.ప్రభుత్వం తక్షణమే యుద్ధప్రాతిపదికన అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి. ట్రాన్స్‌పోర్ట్ టెండర్లు, మిల్ అలాట్‌మెంట్ వెంటనే పూర్తి చేయాలి. రెవెన్యూ, సివిల్ సప్లైస్, డీఆర్డీఏ, కో ఆపరేటివ్ అధికారులు తక్షణమే ఫీల్డ్‌లోకి వెళ్లి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

ఈ ఏడాది సొంతింటి కల నెరవేరిన పేదల ఇళ్లలో ఆత్మగౌరవంతో, ఆనందోత్సాహాల మధ్య దీపావళి పండుగ..!

మొదటిపేజీ తరువాయి...

గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేయించి, లబ్ధిదారులకు ఆత్మీయ చిరు కానుకలను అందించారు. "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" వేడుక ఘనంగా జరుపుకోవాలని ఆడబిడ్డలను ఆశీర్వదించారు.తరువాత మండల కేంద్రంలో రూ. 2 కోట్లతో జిఖఊా పాఠశాల అదనపు తరగతి గదులు, రూ.1.75 కోట్లతో నిర్మించిన ఎంపీడివో కార్యాలయం, రూ. 45 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య, అంగన్‌వాడీ భవనాలు, ప్రాథమిక పాఠశాల భవనం, మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలకు ప్రారంభోత్సవం చేశారు. అదేవిధంగా నూతన తహశీల్దార్ కార్యాలయ భవనం, పాత ఔఊ-7 నందిగామ నుండి నర్సప్పగూడ గ్రామం వరకు బీటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. అనంతరం నిర్వహించిన పబ్లిక్ మీటింగ్ లో పాల్గొని ప్రజాప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి తెలిపారు. సిద్దాపురంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయకుండా వేరే ప్రాంతానికి తరలిస్తామని ఈ ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చారు. . వెంగిరాల గ్రామంలోని భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులను అదే వేదికగా ఆదేశించాను. స్థానిక రైతులకు భూభారతి పట్టాపాసుబుక్కులను అందజేసారు. ప్రజల సంక్షేమం విషయంలో ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం భేషజాలకు పోదు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుంది. పేదల ఇళ్లలో వెలుగులు నింపుతూ, వారి కుటుంబాలతో కలిసి పండుగ సంతోషాలను పంచుకోవాలన్న గొప్ప సంకల్పంతో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమానికి రూపకల్పన చేశాంమని అన్నారు.

ఎస్ఐఆర్-2026 జాబితాలో చోటు పొందని
ఓటర్లకు మరో అవకాశం కల్పించాలి
రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

జననినాదం,మంచిర్యాల ప్రతినిధి నవంబరు 07: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 జాబితాలో చోటు పొందని అర్హత గల ఓటర్లకు మరొక అవకాశం కల్పించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, డూప్లికేట్ కేటగిరీలలో గుర్తించబడి, ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని ఓటర్లకు తుది ఓటరు జాబితాలో పేరు చేర్చుకునేందుకు మరో అవకాశం కల్పించాలని ఎన్నికల సంఘం నిర్ణయించిందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలలో అర్హులైన ఓటర్ల జాబితాను ప్రదర్శించాలని, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. సంబంధిత బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్లను సంప్రదించి, ఎన్యుమరేషన్ ఫారాలు అందజేసి వాటిని సమర్పించే విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇప్పటికే నివాసం మారకుండా ఉన్న ఓటర్లు సంబంధిత ప్రకటనతో పాటు ఎన్యుమరేషన్ ఫారాన్ని సమర్పించవచ్చని, రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి నివాసం మారిన వారు కొత్త చిరునామా, అసెంబ్లీ నియోజకవర్గ వివరాలతో సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ఈ ఎస్ ఐ నెట్ యాప్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రక్రియ పై విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, ప్రతి అర్హులైన ఓటరుకు అవకాశం కల్పించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈ నెల 21వ తేదీలోగా ప్రక్రియను పూర్తి చేసి నివేదిక సమర్పించాలని తెలిపారు.ఎ.ఎన్.డి.డి. కేటగిరీలలో గుర్తించబడి ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని ఓటర్లకు మరో అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనుబంధం ఎ ద్వారా ఓటర్లు తమ



పేరు, ఓటరు గుర్తింపు సంఖ్య, చిరునామా, కుటుంబ సభ్యుల వివరాలు తదితర సమాచారంతో కూడిన ఎన్యుమరేషన్ ఫారాన్ని సమర్పించాలని, అనుబంధం బి ద్వారా గతంలో ఎన్యుమరేషన్ ఫారం సమర్పించ లేకపోయినా, ప్రస్తుతం అదే చిరునామాలో నివసిస్తున్న ఓటర్లు ఫారం సమర్పించ లేకపోయిన కారణాన్ని వివరిస్తూ ఈ ప్రకటన పత్రాన్ని సమర్పించాలని తెలిపారు. అనుబంధం సి ద్వారా రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి నివాసం మారిన ఓటర్లు తమ పాత చిరునామా, కొత్త చిరునామా, అసెంబ్లీ నియోజకవర్గ వివరాలతో పాటు నివాస ధ్రువీకరణ పత్రాన్ని జతచేసి ఈ ప్రకటన పత్రాన్ని సమర్పించాలని తెలిపారు. సంబంధిత ఈ ఆర్ ఓ/ఎ ఈ ఆర్ ఓ/బి ఎల్ ఓ అధికారులకు ఈ పత్రాలను సమర్పించవచ్చని, యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో కొత్త నమోదు కోనం ఫారం-6 సమర్పించిన వారు తిరిగి ఎన్యుమరేషన్ ఫారం సమర్పించవలసిన అవసరం లేదని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరుకు అవకాశం కల్పించేలా బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని, ఈ ప్రక్రియను మీరు నేత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు.జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లాలో 1.15 లక్షల మంది ఎ.ఎన్.డి.డి. ఓటర్లను గుర్తించడం జరిగిందని, సంబంధించిన జాబితాలను ఇప్పటికే సంబంధిత



బూత్ స్థాయి అధికారులకు అందించడం జరిగిందని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించే ప్రక్రియపై జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, గడువు పొడిగింపు, దరఖాస్తుల సమర్పణ విధానంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఎ ఎస్ డి డి జాబితాలో ఉన్న ఓటర్లను సంప్రదించి, వారికి అనుబంధ ఫారాలను అవసరాన్ని బట్టి ప్రకటన పత్రాల సమర్పణ విధానాన్ని వివరించడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరుకు తుది ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే అవకాశం కల్పించేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులు, ఫైళ్ల పరిష్కారంలో వేగం పెంచాలి
జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

జననినాదం,మంచిర్యాల ప్రతినిధి నవంబరు 07: ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ దరఖాస్తులు, ఫైళ్ల పరిష్కారం వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి, ఆర్.డి.ఓ. శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జి.ఓ. నెం. 76 క్రింద వచ్చిన దరఖాస్తుల పురోగతి, జి.ఓ. నెం. 59 దరఖాస్తుల పరిష్కారం, భూసేకరణ ప్రక్రియ, భూ భారతి ఫైళ్ల పరిష్కారం, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షించారు. ఆయా అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, ఫైళ్ల వివరాలను అడిగి



తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులు, ఫైళ్ల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్ణీత గడువులోగా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ సంబంధిత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సులో భాగంగా బియ్యం ధరల నియంత్రణ
జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

జననినాదం,మంచిర్యాల ప్రతినిధి నవంబరు 07: ప్రజా శ్రేయస్సులో భాగంగా ప్రభుత్వం బియ్యం ధరల నియంత్రణ చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలోని బెల్లంపల్లి డివిజన్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన బియ్యం అమ్మకాల అవుట్ లెట్ ను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, మండల తహసిల్దార్ కృష్ణ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రభుత్వ నిర్ణీత ధరకే విక్రయాలు జరిగేలా రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు



చేయడం జరిగిందని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన బి.పి.టి. న్యూ రైస్ బ్యాగ్ ను 1 వేయి 326 రూపాయలు, పాత బియ్యంను 1 వేయి 612 రూపాయలు, హెచ్.ఎం.టి. స్టీమ్ బియ్యం బస్తా 1 వేయి 872 రూపాయలు, జై శ్రీరామ్ పాత బియ్యం 2 వేల 28 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయాలు జరుపాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ.. వ్యక్తి దుర్మరణం..
కర్రతో తలపై దాడి చేసి చెరువులో పడేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడి..
మృతదేహంతో కాంట్రాక్టర్ ఇంటి ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా..
న్యాయం, నష్టపరిహారం అందించాలని డిమాండ్..



జననినాదం,తిర్యాణి నవంబరు 07: మద్యం మత్తులో ఇద్దరి మధ్య చోటుచేసుకున్న ఘర్షణ ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొంది. కర్రతో తలపై దాడి చేయడంతో వ్యక్తి మృతిచెందగా, అనంతరం మృతదేహాన్ని సమీపంలోని చెరువులో పడేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. మరోవైపు మృతుడి కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని, నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టర్ ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు.
పోలీసుల కథనం ప్రకారం.. తిర్యాణి మండలానికి చెందిన ప్రసాద్ (34), సాగర్, చందు వెదురు బొంగులతో వివిధ రకాల పనులు చేసేందుకు గత నెల 30న మాలన్‌గొంది గ్రామానికి వచ్చారు. ఈ నెల 5న క్యాంపునకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసేందుకు ముగ్గురూ ఆసిఫాబాద్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కోనర గ్రామపంచాయతీ పరిధిలోని ఓ ప్రాంతంలో ఆగి మద్యం సేవించారు.కొద్దిసేపటి అనంతరం సాగర్ అక్కడి నుంచి వెళ్లిపోగా, ప్రసాద్, చందు మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో చందు కర్రతో ప్రసాద్ తలపై దాడి చేయడంతో అతడు మృతిచెందినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. అనంతరం మృతదేహాన్ని సమీపంలోని చెరువులో పడేసినట్లు పేర్కొన్నారు.అయితే ప్రసాద్ మృతదేహం చెరువు ఒడ్డున పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు అతడి భార్య ఉషారానికి సమాచారం అందించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉందని స్థానిక సీఐ నీలం రవి తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.కాంట్రాక్టర్ ఇంటి ఎదుట కుటుంబ సభ్యుల ఆందోళనమరోవైపు ప్రసాద్ మృతిపై కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెదురు బొంగుల కటింగ్ పనుల పేరుతో తమ కుమారుడిని తీసుకెళ్లిన కాంట్రాక్టర్ లక్ష్మయ్య అతడి మృతికి బాధ్యత వహించాలని ఆరోపించారు. ఈ మేరకు మృతదేహాన్ని కాంట్రాక్టర్ ఇంటి ఎదుట ఉంచి కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నాకు దిగారు.బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. ఈ ఆందోళనతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



దళారులు, మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దు....
ఉద్యోగాల పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే అప్రమత్తంగా ఉండాలి..
అంగన్వాడీ టీచర్లు, ఆయా పోస్టుల భర్తీ పూర్తిగా పారదర్శకం...
కలెక్టర్ కె. హరిత

జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి నవంబరు 07: అంగన్వాడీ టీచర్లు, ఆయా పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ కె. హరిత స్పష్టం చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఆశ చూపే దళారులు, మధ్యవర్తుల మాటలు నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని ఆమె సూచించారు.జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద పొరుగు సేవల ప్రాతిపదికన చేపడుతున్న అంగన్వాడీ టీచర్లు, ఆయా పోస్టులతో పాటు వైద్య ఆరోగ్య శాఖలోని పోస్టుల భర్తీకి సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తారని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు సమర్పించిన విద్యార్హత ధ్రువపత్రాలు, ఇతర అవసరమైన పత్రాలు, అర్హతలను పరిశీలించిన అనంతరం ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఎంపిక ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు.పోస్టుల భర్తీలో ఎలాంటి అవకతవకలు, సిఫార్సులు, అక్రమ పద్ధతులకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభ్యర్థుల అర్హతలు, సమర్పించిన ధ్రువపత్రాలు, ప్రభుత్వ నిబంధనల ఆధారంగానే ఎంపిక ఉంటుందని, ఎవరికీ ప్రత్యేక ప్రాధాన్యత ఉండదని స్పష్టం చేశారు. ఎంపిక జాబితాలో పేరు వచ్చేలా చేస్తామంటూ కొందరు అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించే అవకాశం ఉందని, అలాంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, వ్యక్తిగతంగా సంప్రదించి ప్రలోభాలకు గురిచేసినా వారి మాటలు నమ్మి ఆర్థికంగా నష్టపోవద్దని హెచ్చరించారు.ప్రభుత్వ ఉద్యోగాలు, సేవా ప్రాతిపదికన చేపట్టే పోస్టుల భర్తీలో దళారులు, మధ్యవర్తుల ప్రమేయానికి ఎలాంటి అవకాశం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. పోస్టుల భర్తీకి సంబంధించి సందేహాలు, ఇతర సమాచారం అవసరమైన అభ్యర్థులు సంబంధిత మహిళా, శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులను నేరుగా సంప్రదించాలని సూచించారు. అభ్యర్థులు తమ దరఖాస్తులకు సంబంధించిన ధ్రువపత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని, అధికారిక సమాచారం



మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపారు.సోషల్ మీడియా, ఇతర అనధికారిక మార్గాల్లో ప్రచారమయ్యే తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు. అంగన్వాడీ వ్యవస్థ ద్వారా మహిళలు, చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రాథమిక విద్య వంటి సేవలను సమర్థవంతంగా అందించడంలో టీచర్లు, ఆయాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహిస్తామని కలెక్టర్ కె. హరిత వెల్లడించారు.

దివ్యాంగుల సాధికారత కృషికి రాష్ట్ర స్థాయి పురస్కారాల కొరకు దరఖాస్తుల స్వీకరణ
జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్

జననినాదం,మంచిర్యాల ప్రతినిధి నవంబరు 07: దివ్యాంగుల అభ్యున్నతి, సాధికారతకు విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు ప్రభుత్వం అందించే రాష్ట్ర స్థాయి పురస్కారాల కొరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి వేడుకలను ఘనంగా నిర్వహిస్తుందని, ఈ సందర్భంగా దివ్యాంగుల అభ్యున్నతి, సాధికారత కోసం విశేష కృషి చేసిన ఉత్తమ వ్యక్తులు స్వచ్ఛంద సంస్థలకు రాష్ట్ర స్థాయి పురస్కారాలను ప్రధానం చేసి సత్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అర్హులైన దివ్యాంగులు, సేవకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు విధానం, నమూనా, పురస్కారాలకు సంబంధించిన పూర్తి మార్గదర్శకాల కొరకు అధికారిక వెబ్‌సైట్ https://depwdsctgp.telangana.gov.in లో సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లాలోని అర్హులైన వ్యక్తులు, సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నిర్దేశిత నమూనాలో అవసరమైన ధృవీకరణ పత్రాలను జతచేసి ఈ నెల 16వ తేదీలోగా జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.



ఆదివాసి సాంప్రదాయ పండుగ దండారి వేడుక!!

ఆదివాసీల విశిష్ట జీవన విధానానికి, ప్రకృతి ఆరాధనకు, సమున్నత సంస్కృతికి సజీవ ప్రతిరూపం దండారీ పండుగ. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు అద్దం పట్టే దండారి ఉత్సవాలు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. తరతరాలుగా పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న ఈ పండుగ ఆదివాసీల జీవన విధానానికి, అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. దీపావళి పండుగను పురస్కరించుకొని సుమారు పదిహేను రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకలు ఆదివాసీ గ్రామాల్లో పండుగ సందడిని నింపుతాయి. తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా (ముఖ్యంగా కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో) అడవి బిడ్డలైన రాజ్‌గోండ్లు, కొలాంలు అత్యంత పవిత్రంగా, వైభవంగా జరుపుకునే అతిపెద్ద గిరిజన సాంస్కృతిక ఉత్సవం ఇది. దీపావళి పండుగను పురస్కరించుకుని సాగే ఈ దండారీ నృత్యాలు, వేడుకలు వారి ఆచార వ్యవహారాలను, సామరస్యాన్ని ప్రపంచానికి చాటిచెబుతాయి. పండుగ నేపథ్యం మరియు కాలం (ఆశ్వయుజ అమావాస్య వేడుక):



గోండుల క్యాలెండర్ ప్రకారం 'పోరుపాండోయ్' (పంటల పండుగ) తర్వాత, ఆశ్వయుజ మాసంలో పంటలు చేతికి వచ్చే తరుణంలో ఈ వేడుకలు ప్రారంభమవుతాయి. దసరా పండుగ ముగిసిన మరుసటి రోజు నుండి ప్రారంభమై, దీపావళి వెళ్ళిన రెండు రోజుల వరకు (దాదాపు గిరిజన సాంప్రదాయం ప్రకారం 10 నుండి 15 రోజుల పాటు) ఈ ఉత్సవాలు సాగుతాయి. శ్రమజీవులైన ఆదివాసీలు తాము పండించిన పంటలు చేతికి అందివచ్చిన ఆనందంలో, ప్రకృతికి కృతజ్ఞతలు తెలుపుతూ ఈ వేడుకను జరుపుకుంటారు. గుస్సాడీ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణ దండారి ఉత్సవాల్లో గుస్సాడీ నృత్యం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. నెమలి ఈకలతో తయారు చేసిన భారీ తలపాగాలు, ప్రత్యేక సంప్రదాయ వస్త్రధారణ, శరీరానికి బూడిద పూసుకొని కళాకారులు చేసే నృత్యాలు చూపరులను మంత్రముగ్ధులను చేస్తాయి. డప్పులు, డోలు, గుమేళ వంటి సంప్రదాయ వాయిద్యాల మోతకు అనుగుణంగా యువకులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తారు. రాజ్ గోండ్, కొలాం, ప్రధాన్ తదితర ఆదివాసీ తెగల ప్రజలు ఈ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా జరుపుకుంటారు. గ్రామాల మధ్య బంధుత్వాలకు వారధి దండారి ఉత్సవాల్లో మరో విశేషం గ్రామాల మధ్య ఉన్న బంధుత్వ సంబంధాలు. ఒక గ్రామానికి చెందిన దండారి కళాబృందాలు తమ కుమార్తెలను లేదా సోదరీమణులను వివాహం చేసుకున్న ఇతర గ్రామాలకు బృందాలుగా వెళ్లి నృత్య ప్రదర్శనలు ఇస్తాయి. ఆయా గ్రామాల ప్రజలు కళాబృందాలకు ఘన స్వాగతం పలికి ఆతిథ్యం ఇస్తారు. ఆటపాటలు, నృత్యాలతో గ్రామాల్లో సందడి నెలకొంటుంది. ఈ సంప్రదాయం కేవలం కళా ప్రదర్శనకే పరిమితం కాకుండా ఆదివాసీ కుటుంబాల మధ్య బంధుత్వాలను, స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది.

యువతకు పరిచయ వేదిక:

దండారి ఉత్సవాలు ఆదివాసీ యువతకు ఒకరికొకరు పరిచయం కావడానికి, సామాజిక సంబంధాలను పెంపొందించుకోవడానికి వేదికగా నిలుస్తాయి. ఈ వేడుకల ద్వారా యువతీ యువకులు సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను తెలుసుకుంటూ తమ సంస్కృతిని కొనసాగిస్తున్నారు. పెద్దలు, యువత కలిసి ఉత్సవాల్లో పాల్గొనడం ద్వారా తరతరాల మధ్య సాంస్కృతిక వారసత్వం బదిలీ అవుతోంది.

గుస్సాడీ కళకు ప్రపంచ గుర్తింపు:

ఆదివాసీ గుస్సాడీ నృత్యానికి విశేష గుర్తింపు తీసుకురావడంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత కనకరాజు కీలక పాత్ర పోషించారు. తన కళా ప్రదర్శనల ద్వారా గుస్సాడీ నృత్య విశిష్టతను దేశవ్యాప్తంగా చాటిచెప్పారు. ఆయన కృషితో ఈ సంప్రదాయ కళారూపానికి మరింత గుర్తింపు లభించింది. భావితరాలకు వారసత్వ సంపద..
ఆధునిక జీవనశైలి, కాలానుగుణ మార్పులు చోటుచేసుకుంటున్నప్పటికీ ఆదివాసీలు తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన దండారి సంప్రదాయాలను కొనసాగించడం విశేషం. దండారి పాటలు, గుస్సాడీ వేషధారణలు, సంప్రదాయ వాయిద్యాలు ఆదివాసీ జీవన సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయి. ఈ కళారూపాలను కాపాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆదివాసీ పెద్దలు అభిప్రాయపడుతున్నారు. దండారి ఉత్సవాలు కేవలం ఆటపాటలు, వినోద కార్యక్రమాలు మాత్రమే కాకుండా ఆదివాసీల అస్తిత్వం, ఆత్మగౌరవం, ఐక్యత, బంధుత్వాలకు ప్రతీక. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా సంస్కృతీ వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతున్న ఈ ఉత్సవాలు తెలంగాణ సాంస్కృతిక వారసత్వంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాయి.

దండారీ పండుగ విశిష్ట ఆచారాలు:

దండారీ పండుగలో ప్రతి అడుగూ ఒక పవిత్రమైన సాంప్రదాయంతో ముడిపడి ఉంటుంది.

న్ గుస్సాడీల ఆగమనం: ఈ పండుగలో అత్యంత ప్రధాన ఆకర్షణ 'గుస్సాడి'. దండారీ నృత్యం చేసేవారిలో కొందరు ప్రత్యేక దీక్షను స్వీకరిస్తారు. వీరే గుస్సాడీలు. వీరు దీక్షా కాలంలో అత్యంత కఠినమైన బ్రహ్మచర్యాన్ని పాటిస్తారు. కాళ్ళకు గజ్జెలు, మొలతాడుకు మేక తోలు, ఒంటిపై భస్మం (బూడిద), చేతిలో రోకలి (సటకెం) ధరిస్తారు.

న్ మయూర పింఛ కిరీటం (మల్ జాలీ): గుస్సాడీల వస్త్రధారణలో అత్యంత పవిత్రమైనది నెమలి ఈకలతో తయారు చేసిన పెద్ద కిరీటం. దాదాపు 1500 నుండి 2000 నెమలి ఈకలతో ఈ కిరీటాన్ని అద్భుతంగా రూపొందిస్తారు. దీనిని వారు తమ ఆరాధ్య దైవమైన 'ఏత్మసూర్ పూజ' (గోండుల దేవత) రూపంగా భావిస్తారు. వాద్య పరికరాల పూజ: వేడుకలు ప్రారంభమయ్యే ముందు గోండులు తమ సాంప్రదాయ వాయిద్యాలైన పెర్ర (డప్పు), వెట్టీ, కింగ్రీ, తుడుం, వెట్టి వంటి వాటికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



నృత్య వైభవం మరియు కళా రూపం:

దండారీ కేవలం ఆచారాల పండుగ మాత్రమే కాదు, అది ఒక అద్భుతమైన జానపద కళారూపం.

న్ లయబద్ధమైన దండారీ నృత్యం: చేతిలో చిన్న కర్రలు (దండాలు) పట్టుకుని, డప్పుల మోతకు, తుడుం శబ్దానికి అనుగుణంగా గుండ్రంగా తిరుగుతూ లయబద్ధంగా చేసే నృత్యమే దండారీ.

న్ గుస్సాడీల హాస్యం – లాస్యం: శాంత స్వరూపులైన గుస్సాడీలు నృత్యం చేస్తున్నప్పుడు వన్యప్రాణుల కదలికలను, వేట పద్ధతులను అనుకరిస్తారు. వీరు మాట్లాడే భాష, చేసే చేష్టలు నవ్వులు పూయిస్తాయి. అయినప్పటికీ సమాజంలో వీరికి అమితమైన గౌరవం ఉంటుంది. వీరు ఎవరి ఇంటికి వెళ్లినా కాళ్లు కడిగి, తిలకం దిద్ది ఆశీర్వాదం తీసుకుంటారు. సామాజిక సామరస్యం 'వెడ్చీ' సంస్కృతి (ఆతిథ్యం): ఈ పండుగలో దాగి ఉన్న అత్యంత గొప్ప సామాజిక కోణం ఏమిటంటే గ్రామాల మధ్య బంధుత్వం. ఒక గ్రామానికి చెందిన దండారీ బృందం (భోగాటోళ్ళు) గుస్సాడీలతో కలిసి పొరుగు గ్రామానికి అతిథులుగా వెళ్తారు. దీనిని 'వెడ్చీ' లేదా 'దండారీ యాత్ర' అంటారు. అలా వెళ్ళినప్పుడు ఎదుటి గ్రామం వారు వీరికి ఘనస్వాగతం పలికి, తమ ఇళ్లలో ఆశ్రయం కల్పించి, విందు భోజనాలు వడ్డిస్తారు. రెండు, మూడు రోజుల పాటు పరస్పరం నృత్యాలు చేస్తూ, తమ సంస్కృతిని పంచుకుంటారు. ఇది గిరిజన సమాజంలో ఐక్యతను, పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందిస్తుంది. అంతర్గత కలహాలను రూపుమాపుతుంది. పర్యావరణం మరియు ప్రకృతితో ముడిపడిన జీవన **తత్వం:**
ఆదివాసీల ప్రతి పండుగలోనూ ప్రకృతి ఆరాధన కనిపిస్తుంది. దండారీ కూడా అందుకు మినహాయింపు కాదు. నెమలి ఈకలను కిరీటంగా ధరించడం, అడవిలోని జంతువుల కదలికలను నృత్యంలో ప్రదర్శించడం ద్వారా తాము ప్రకృతిలో ఒక భాగమనే సందేశాన్ని ఇస్తారు. శరదృతువు అందాలు, అడవి తల్లి కరుణించిన పంటలు, పశు సంపద పట్ల కృతజ్ఞతా భావాన్ని ప్రకటించే జీవన తత్వమే ఈ పండుగ పరమార్థం.



ముగింపు : ప్రతి ఏటా దీపావళి సందర్భంగా జరుపుకునే దండారి వండుగ ఆదివాసీల సంప్రదాయానికి ప్రతీక. ఆదివాసీ తెగల ప్రజలు వండుగలో పాల్గొంటారు. తరతరాలుగా అనుసరిస్తున్న సంస్కృతిని కొనసాగిస్తాం. ఆదివాసీ అస్తిత్వానికి ప్రతీకగా నిలువుతాము. కాలం మారుతున్నా, ఆధునిక సాంకేతికత గ్రామాలపై దాడి చేస్తున్నా, లంబాడీ, గోండు, కొలాం గిరిజనులు తమ దండారీ-గుస్సాడీ సంస్కృతిని ప్రాణప్రదంగా కాపాడుకుంటూ వస్తున్నారు. గుస్సాడీ నృత్యానికి పద్మశ్రీ అవార్డు (కనక రాజు గారికి) దక్కడం ఈ కళ యొక్క ప్రపంచ స్థాయి గుర్తింపునకు నిదర్శనం. దండారీ కేవలం ఒక పండుగ కాదు; అది ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీక, వారి అస్తిత్వ వేదిక. నైతిక విలువలు, కఠినమైన క్రమశిక్షణ, సామాజిక సమరసత, ప్రకృతి పట్ల గౌరవం కలగలిసిన ఈ మహోత్సవం తెలంగాణ సంస్కృతికే మకుటాయమానమైనది. దీనిని కాపాడుకోవడం, భవిష్యత్ తరాలకు అందించడం మనందరి బాధ్యత.



కనక విజయ్
తెలంగాణ విశ్వవిద్యాలయం
93916 36329

కరువు మండలాల రైతుల రుణాలను రీషెడ్యూల్ చేయాలి

బ్యాంకర్లకు కలెక్టర్ హరిత ఆదేశం..

జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి నవంబరు 07: ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైన ఐదు మండలాల్లో రైతులకు ఖరీఫ్ సీజన్‌లో మంజూరు చేసిన బ్యాంకు రుణాలను రీషెడ్యూల్ చేయాలని కలెక్టర్ హరిత బ్యాంకర్లను ఆదేశించారు. అర్హులైన రైతులకు రుణాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కరువు సహాయక చర్యలపై బ్యాంకర్లతో నిర్వహించిన జిల్లా సలహా కమిటీ సమావేశంలో ఎల్‌డీఎం జనార్ధన్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో ఐదు మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు నమోదయ్యాయని తెలిపారు. ఆయా మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో రుణాలు పొందిన రైతుల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు అందజేసి, రీషెడ్యూల్ ప్రక్రియలో సానుకూలంగా వ్యవహరించాలని బ్యాంకర్లకు సూచించారు. రుణాలు తీసుకున్న ప్రతి రైతుకు రీషెడ్యూల్ వివరాలను తెలియజేయాలన్నారు. పంట రుణాలతో పాటు టర్మ్ లోన్లు, డెయిరీ, పౌల్ట్రీ, గొర్రెలు, మేకల పెంపకం, మత్స్య పరిశ్రమ తదితర వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు తీసుకున్న రుణాలను కూడా పునర్వ్యవస్థీకరించాలని స్పష్టం చేశారు. అర్హత కలిగిన ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులకు సైతం బ్యాంకులు రుణాలు అందించాలని సూచించారు. రుణాల కోసం రైతులను బ్యాంకుల చుట్టూ తిప్పించుకోవద్దని, వారికి ఇబ్బందులు కలగకుండా అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో వివిధ బ్యాంకుల మేనేజర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్

ప్రతిమా సింగ్ దీపావళి శుభాకాంక్షలు

మెదక్ 07: జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, చీకటిపై వెలుగు సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని అధిక శబ్దం, వాయు కాలుష్యానికి కారణమయ్యే టపాసులకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు, పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షించాలని, తగిన జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాలకు తావులేకుండా చూసుకోవాలని తెలిపారు. దీపావళి పర్వదినం జిల్లా ప్రజలందరి ఇళ్లలో సిరినంవదలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.



Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293. **Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197